అప్పుల బాధతో చేనేత కార్మికుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణంలోని కొత్తపేటలోని రాంనగర్ వద్ద చేనేత కార్మికుడు నీలూరి కృష్ణమూర్తి (60) అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని భార్య నాగలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ రెడ్డప్ప తెలిపారు. మృతునికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వారందరికీ వివాహం చేశాడు. చేనేతలో గిట్టుబాటు కాక, కుటుంబపోషణ నిమిత్తం, పిల్లల పెళ్లిళ్ల నిమిత్తం చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక నిత్యం మధనపడేవాడని కృష్ణమూర్తి కుటుంబసభ్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

మృతుడు కృష్ణమూర్తి

ఆర్థికసాయం : అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న కృష్ణమూర్తి కుటుంబసభ్యులకు టిడిపి యువ నాయకులు సందా రాఘవ ఆర్థికసాయం అందజేశారు. మృతుని ఇంటివద్దకు వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతు భార్య నాగలక్ష్మికి రూ. 10వేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సందా రవి, జింకా పురుషోత్తం, కేశగాళ్ల శ్రీనివాసులు, కొత్తపేట ఆది , నర్సి, హరి ,సాయి తిర , సూరి తదితరులు పాల్గొన్నారు.

రైతు చుట్టూ రాజకీయం

వ్యాపారంలో నష్టాలే ఆత్మహత్యకు కారణమంటున్న అధికారపార్టీ
గిట్టుబాటు ధర లేకపోవడమే కారణమంటున్న వైసిపి
రాజకీయాలు మాని రైతులను ఆదుకోవాలన్న రైతు, ప్రజాసంఘాలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతి నిధి/ పుట్లూరు

పుట్లూరు మండలం వెల్లుట్ల గ్రామానికి చెందిన అరటి రైతు నాగలింగం ఆత్మహత్య చుట్టూ రాజకీయరంగు పులుముకుంటోంది. అప్పుల బాధతో పొలంలో పురుగుల మందుతాగి నాగలింగం గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నాగలింగం మృతదేహాన్ని పోస్టుమార్గం నిమిత్తం గురువారం సాయంత్రం అనంతపురం సర్వజన ఆసుపత్రికి తీసుకొచ్చారు. అరటిరైతు కావడంతో ఆలస్యమయితే విపక్షాల నుంచి ఆందోళన మొదలయ్యే అవకాశముందని భావించి శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల్లోపే పోస్టుమార్టం నిర్వహించి పోలీసు బలగాలతో మృతదేహాన్ని పుట్లూరు మండలం వెల్లుట్లకు తరలించే చర్యలు చేపట్టారు. ఆ సమయానికి శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి, అటు వైసిపి శింగనమల సమన్వయకర్త డాక్టర్ సాకే శైలజనాథ్ అక్కడికి చేరుకున్నారు. ఇంత ఉదయాన్నే పోస్టుమార్టం నిర్వహించి తీసుకెళ్లడం ఏమిటని శైలజనాథ్ ఆరా తీస్తుండగా, అక్కడేవున్న బండారు శ్రావణి తాము వారికి ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా అండగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని శైలజనాథ్‌ను ఉద్దేశించి మాట్లాడారు. ఇలా ఇద్దరి మధ్య సంభాషణ అనంతరం ఇద్దరూ మీడియాతో మాట్లాడారు.

నాగలింగం మృతదేహానికి ఎమ్మెల్యే నివాళి

నాగలింగం అంత్యక్రియల్లో వైసిపి నాయకులు



విలేకరుల సమావేశంలో ఎపి రైతుసంఘం నాయకులు

ప్రభుత్వ తీరు బాగోలేదు : వైసిపి

ఇది ముమ్మాటికి ప్రభుత్వ హత్యనే. అరటి రైతుకు సరైన గిట్టుబాటు ధరలేదని, కల్పించాలని తాము ముందు నుంచి కోరుతూ వస్తున్నాం. కాని ప్రభుత్వం ఒక్క కిలో అరటినీ ఇప్పటి వరకు కొనుగోలు చేయలేదు అని వైసిపి శింగనమల ఇన్‌ఛార్జి శైలజనాథ్ విమర్శించారు. మృతిచెందిన నాగలింగం కుటుంబసభ్యులను పరామర్శించడానికి వస్తే హడావుడిగా పోస్టుమార్టం పూర్తి చేసి మృతదేహాన్ని తరలిస్తున్నారన్నారు. పైగా నాగలింగం రైతే కాదన్నట్టుగా చెప్పే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. వ్యాపారంలో వచ్చిన నష్టాలతోనే చనిపోయినట్టుగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది సరైన పద్ధతి కాదన్నారు. నాగలింగం తనకు ముందు నుంచి తెలుసని ఆయనకు పొలం కూడా ఉందని చెప్పారు. ఏది ఏమైనా ప్రభుత్వ తీరు రైతుల విషయంలో సరిగా లేదని విమర్శించారు. రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

రైతునాగలింగం (ఫైల్‌ఫోటో)

వ్యాపారంలో వచ్చిన నష్టాలతోనే నాగలింగం ఆత్మహత్య : టిడిపి

నాగలింగం అరటి వ్యాపారం చేసేవాడని అందులో వచ్చిన నష్టాలతోనే నాగలింగం ఆత్మహత్య చేసుకున్నాడని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి అన్నారు.. అయినా ప్రభుత్వం ఆ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. వ్యక్తిగతంగా మృతుని కుటుంబసభ్యులకు అండగా ఉంటామని అన్నారు. వారి పిల్లలు చదుకుంటామంటే ఎన్టీఆర్ ట్రస్టులోనూ చదివిస్తామన్నారు. నాగలింగం ఆత్మహత్యపై వైసిపి శవరాజకీయాలు చేయాలని చూస్తోందని విమర్శి:చారు. ఇది సరైంది కాదని అన్నారు .

గత వైసిపి నిర్వాకంతోనే నాగలింగం ఆత్మహత్య : అచ్చెన్నాయుడు

నాగలింగం ఆత్మహత్యకు 2021 నుంచి 2024 మధ్య కాలంలో వచ్చిన నష్టాలే కారణమని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చంనాయుడు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నాగలింగం అనే వ్యక్తి 0.83 సెంట్లు మాత్రమే భూమి ఉందన్నారు. మరో మూడు ఎకరాలు కౌలుకు తీసుకుని పంట సాగు చేశాడన్నారు. దీంతోపాటు అరటి ట్రేడింగ్ చేసేవాడన్నారు. అందులో నష్టాలొచ్చి అప్పులు పెరిగిపోవడంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడని అన్నారు. ఏది ఏమైనా నాగలింగం మృతి బాధాకరమన్నారు. ప్రభుత్వం ఆ కుటుంబాన్ని ఆదుకుంటుందని చెప్పారు. అయితే దీన్ని వైసిపి శవరాజకీయాలు చేసి ప్రభుత్వానికి అంటగట్టే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు.

నాగలింగం ఆత్మహత్య చుట్టూ రాజకీయ రంగు

నాగలింగం ఆత్మహత్య అనంతరం జరిగిన పరిణామాలపై రెండు పార్టీల నాయకులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడంతో రాజకీయ రంగు పులుముకుంటోంది. వాస్తవానికి ఈ ఏడాది అరటి పంటకు సరైన గిట్టుబాటు ధర లేక చాలా మంది రైతులు తీవ్రమైన ఇబ్బందులు పడ్డారు. కొనేందుకు కూడా వ్యాపారులు ముందుకురాకపోవడంతో పొలాలను దున్నేసిన సందర్భాలూ ఉన్నాయి. ఎకరానికి ఒకటిన్నర లక్షల రూపాయల వరకు పెట్టుబడులు పెట్టి గిట్టుబాటు ధర లేక అరటి రైతు తీవ్రంగా నష్టపోయారు. వారిని ఆదుకోవాలని గత నెల ఆరంభంలోనే ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆ తరువాత వైసిపి కూడా ధర్నా నిర్వహించింది. అనంతరం జిల్లా కలెక్టరు ఆనంద్ వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేసి ఆరు రూపాయలకు తక్కువ కాకుండా కొనుగోలు చేయాలని తెలిపారు. అయినా కొనేవారు రాక రైతులు ఇబ్బందులు పడుతూవచ్చారు. ప్రభుత్వం మాత్రం దీని కొనుగోలు చేపడతామంటూ ప్రకటనలు చేసింది కాని ఇంత వరకు కొనుగోలు ఆరంభించలేదు. ఈ క్రమంలోనే నాగలింగం ఆత్మహత్య చేసుకోవడం రాజకీయ రంగు పులుముకుంటోంది.

నాగలింగం అంత్యక్రియల్లో అనంత, శైలజానాథ్: ఆత్మహత్యకు పాల్పడిన అరటి రైతు నాగలింగం ఆంత్యక్రియల్లో వైసిపి జిల్లా అధ్యక్షులు అనంతవెంకటరామిరెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త శైలజనాథ్, నాయకులు సత్యనారాయణరెడ్డి, మండల కన్వీనర్లు మహేశ్వర్ రెడ్డి గువ్వల శ్రీకాంత్ రెడ్డి ఖాదర్ వలీ ఖాన్ పూల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు నాయకులు మాట్లాడుతూ .ముఖ్యమంత్రి చంద్రబాబు అసమర్థత కారణంగానే రైతుల ఆత్మహత్యలు జరుగుతున్నాయని విమర్శించారు. అనంతపురం జిల్లాను ఆత్మహత్యలకు నిలయంగా మార్చొద్దని ప్రభుత్వాన్ని కోరారు. కూటమి ప్రభుత్వం కళ్లు తెరిపించడానికి ఈనెల 8వ తేదీన కలెక్టరేట్ లేదా జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని తెలిపారు.

నాగలింగం మృతి విచారకరం : టిడిపి

అరటి రైతు నాగలింగం ఆత్మహత్య బాధాకరని టిడిపి నాయకులు అన్నారు. ఈసందర్భంగా మృతుని కుటుంబసభ్యులను టిడిపి నాయకులు పరామర్శించారు. తక్షణ సాయం కింద ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ మృతుని కుటుంబసభ్యులకు ఆర్థికసాయం అందజేశారు. ఈకార్యక్రమంలో కూటమి నాయకులు ముంటిమడుగు శ్రీనివాస్ రెడ్డి , జీ.సీ.రామానాయుడు , ఓబులాపురం శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు టిడిపి నాయకులు మాట్లాడుతూ సున్నితమైన సమయంలో కూడా వైసీపీ నేతలు రాజకీయ ప్రయోజనాల కోసం ప్రయత్నించడం అనైతికమన్నారు. కుటుంబ పెద్దదిక్కుని కోల్పోయి వారు బాధలో ఉంటే ఈ రాజకీయాలు ఏమిటని ప్రశ్నించారు. మృతుని కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు.

అరటి రైతు నాగలింగం కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి : ఎపి రైతుసంఘం

శింగనమల నియోజకవర్గం పుట్లూరు మండలంలోని ఎల్లుట్ల గ్రామానికి చెందిన అరటి రైతు నాగలింగం ఆత్మహత్య బాధాకరమని రైతు నాగలింగంది ప్రభుత్వ హత్యే అని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆర్ చంద్రశేఖర్ రెడ్డి జిల్లా అధ్యక్షులు బి హెచ్ రాయుడు, పండ్లతోటల రైతుసంఘం జిల్లా కార్యదర్శి వి శివారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక రైతుసంఘం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న అరటి రైతు నాగలింగం కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అరటి ధరలు అమాంతం పడిపోవడంతో పంట సాగుకు చేసిన అప్పు తీర్చే మార్గం లేక నాగలింగం గురువారం తన స్వగ్రామంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకునే పరిస్థితి వచ్చిందన్నారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లాలో రైతుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. చేతికొచ్చిన పంటలు అమ్ముకునే సమయానికి గిట్టుబాటు ధర లభించడం లేదని, ఈ క్రమంలోనే అప్పులు భారం మోయలేక రైతులు ఆత్మహత్యకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అరటి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని,టన్ను రూ.15వేలుతో ప్రభుత్వం కొనుగోలు చేయాలని, నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 50వేలు నష్టపరిహారం ఇవ్వాలని రైతు సంఘాలు, వామపక్ష, ప్రతి పక్షపార్టీలు ఆందోళన చేస్తున్న ప్రభుత్వం స్పందించక పోవడం దారుణమన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెబుతున్న మాటలు రైతన్న మీకోసం ప్రోగ్రాం రైతులకు భరోసా కల్పించే విధంగా లేకపోవడంతోనే రైతు నాగలింగం ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. అరటి ,మొక్క జొన్న, పత్తి, వరి, కంది పంటలకు గిట్టుబాటు ధర తో ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతు నాగలింగం కుటుంబాన్ని ప్రభుత్వం దత్తత తీసుకుని ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

గిరిజన రైతుపై మండల సర్వేయర్ దురుసు ప్రవర్తన

ప్రజాశక్తి - తనకల్లు

తనకు చెందిన భూమిని సర్వే చేయాలని పలుమార్లు కోరుతున్నప్పటికీ మండల సర్వేయర్ స్పందించకుండా తనపై దురుసుగా వ్యవహరిస్తున్నాడని మండల పరిధిలోని మల్ రెడ్డి పల్లి పంచాయతీ లోని పెండ్లిగుండు రాముని తండాకు చెందిన రైతు కొర్రకల రామ్మూర్తి నాయక్ వాపోయారు. ఈ మేరకు రామ్మూర్తి నాయక్ మాట్లాడుతూ తనకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. మండల కేంద్రానికి కేంద్రానికి చెందిన తనకంటి ఈశ్వరమ్మ నుండి 2016 వ సంవత్సరంలో సర్వేనెంబర్ 837 లో దాదాపు తొమ్మిది మంది గిరిజనులు ఇంటి స్థలం కొన్నామన్నారు.. అందులో భాగంగా తనకు సుమారు 11 సెంట్లు విక్రయించారన్నారు. గతంలో ఈ సర్వే నంబర్ లో వివాదాలు ఉండగా జాతీయ కమిషన్ న్యూఢిల్లీ నుండి సత్యసాయి జిల్లా కలెక్టరుక్కు ఆదేశాలు అందినట్లు రైతు రామ్మూర్తి నాయక్ తెలిపారు. ఈ విషయంపై తహశీల్దార్ ను సంప్రదించగా తనకు సంబంధించిన భూమిని సర్వే చేసి హద్దులు చూపించాలని మండలసర్వేయర్‌ను తహశీల్దార్ ఆదేశించారన్నారు. దీంతో తన ఇంటిస్థలాన్ని సర్వే చేసి హద్దులు చూపాలని చలానా కట్టి వెళితే సర్వేయర్ స్పందించడం లేదని విమర్శించారు. ఇదే విధంగా ఇప్పటిదాకా నాలుగుసార్లు చలానా చెల్లించానని వాపోయారు. స్థలాన్ని సర్వేచూపి హద్దులు చూపించాలని మండల సర్వేయర్‌ను పలుమార్లు వేడుకున్నా పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యకర్తం చేశారు. ఈవిషయంపై ఫోన్ చేస్తే తనను నానా దుర్భాషలాడాడని ఆరోపించారు. ఈ విషయంపై సంబందిత ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని బాధితుడు రామ్మూర్తినాయక్ కోరుతున్నాడు.

సిఐటియు మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - లేపాక్షి

ఈనెల 31వ తేదీ నుంచి విశాఖపట్టణంలో నిర్వహించే అఖిలభారత జిల్లా మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు జడ్‌పి. శ్రీనివాసులు, పిరంగి ప్రవీణ్ కుమార్ కోరారు. మండల కేంద్రం లోనినంది విగ్రహం ఆవరణంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న వారు మాట్లాడారు. మండలం లోని అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు,పంచాయతీ కార్మికులు అఖిల భారత సీఐటీయూ మహాసభలకు హాజరై జయప్రదం చేయాలన్నారు. కార్మికుల హక్కులు కోసం సిఐటియు నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు కృష్ణమూర్తి, ఆశా కార్యకర్తలు జిల్లా అధ్యక్షులు రాధమ్మ, అంగన్వాడీ నాయకులు ధనమ్మ, భాగ్యమ్మ, శైలజ, శివమ్మ, పంచాయతీ కార్మికులు అశ్వర్థప్ప, ప్రమీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-హిందూపురం

కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తనడ వంతు కృషి చేస్తానని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నాయకులు నారాయణస్వామి పేర్కొన్నారు. శుక్రవారం డిపో ఆవరణలో నారాయణస్వామి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ డిపో గౌరవాధ్యక్షులు శివశంకర్, కార్యాలయ అధికారులు షౌకత్ అలీ, సత్యనారాయణ రావు తదితరులు హాజరై నారాయణ స్వామికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నారాయణస్వామి ఆర్టీసీ కార్మికులు, అధికారుల సమక్షంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాబయ్య, ప్రసాద్, జిలానీ, మల్లికార్జున, వెంకటేష్, శ్రీనివాసులు, వెంకటలక్ష్మి, పోతిరెడ్డి, చలపతి, దాలప్ప తదితరులు పాల్గొన్నారు.

వేమన సర్కిల్‌లో మరమ్మతులు

ప్రజాశక్తి-హిందూపురం

యోగి వేమన జయంతి వేడుకలను త్వరలో హిందూపురంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు వైసిపి నాయకులు తెలిపారు. ఇందులో భాగంగా పట్టణ సమీపంలో ఉన్న ఆటోనగర్ క్రాస్ లో ఉన్న వేమన సర్కిల్ వద్ద వైసిపి నాయకులు గుడ్డంపల్లి వేణు రెడ్డి సొంత నిధులతో చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో అక్కడ జరుగుతున్న పనులను నాయకులు శుక్రవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సడ్లపల్లి రామచంద్రా రెడ్డి, శబరీష్ రెడ్డి, ప్రణయ్ రెడ్డి, కొటిపి శ్రీనివాస రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభ్యంతరాలు తెలపకపోతే టిడిఆర్ బాండ్లు జారీ
మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున

విలేకరులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణ అభివృద్ధిలో భాగంగా రోడ్ల విస్తరణకు సంబంధించి భూములు, భవనాలు కోల్పోతున్న వారికి ప్రభుత్వ నిబంధనల మేరకు టిడిఆర్ బాండ్లు మంజూరు చేస్తున్నామని, దీనిపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే 15 రోజుల్లో అభ్యంతరాలు తెలపాలని మునిసిపల్ కమిషనర్ మల్లికార్జున కోరారుఠీ మేరకు ఆయన శుక్రవారం మాట్లాడుతూ, పట్టణ అభివృద్ధిలో భాగంగా రైల్వే ఫీడర్ రోడ్డు సంబంధించిన సుమారు 0.90 కిలోమీటర్ల పొడవు కలిగిన రోడ్డు అభివృద్ధి చేయనున్నామన్నారు. అందులో భాగంగా మాస్టర్ ప్లాన్ రోడ్డులో ప్రభావితమయ్యే ప్రైవేట్ భూములను స్వాధీనం చేసుకొని సంబంధిత భూస్వాములకు ప్రభుత్వ నిబంధనల మేరకు టిడిఆర్ బాండ్లు ఇవ్వడానికి ఇప్పటికే మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం తెలిపిందన్నారు. దీంతోపాటు ఎవరెవరి భవనాలు, భూములు కోల్పోతున్న వారి వివరాలు పత్రికా ప్రకటన ద్వారా విడుదల చేయడం జరిగిందన్నారు. దీంతోపాటు ప్రభావిత ఆస్తుల యజమానుల వివరాల జాబితా సంబంధిత సచివాలయాల్లో, మున్సిపల్ కార్యాలయంలో ప్రచురించడం జరిగింది. ఈ విషయమై యజమానుల గురించి ప్రత్యేకమైన అభ్యంతరాలు, సూచనలు 15 రోజుల గడువు లోపు రాతపూర్వకంగా సమర్పించకపోతే ఎటువంటి అభ్యంతరాలు లేవని భావించి ఆస్తి యజమానులకు టిడిఆర్ బాండ్లు జారీ చేయడాన్ని కొనసాగిస్తామన్నారు.

'మరగుజ్జుపై రాజకీయ కక్ష తగదు'

తనకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తున్న ఆదినారాయణ

ప్రజాశక్తి-హిందూపురం

మరుగుజ్జు అయిన తనపై రాజకీయ కక్ష తగదని బాధితుడు స్టోర్ డీలర్ ఆదినారాయణప్ప అవేదన వ్యక్తం చేశాడు. శుక్రవారం స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవన ఉపాధి కోసం గత కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో తనకు హిందూపురం రూరల్ కగ్గల్లు గ్రామానికి చౌక ధాన్యపు డీలర్‌గా ప్రభుత్వం నియమించిందన్నారు. అయితే ఇటీవల రాజకీయ కక్షతో తనను చౌక ధాన్యపు డీలర్ నుండి తొలగించారని వాపోయారు. డీలర్‌గా నియమించినప్పటి నుండి ఇప్పటివరకు ప్రభుత్వ నిబంధనల మేరకు లబ్ధిదారులకు నిత్యావసర వస్తువులు సరఫరా చేస్తున్నానని అన్నారు. మరుగుజ్జు అనే కనికరం లేకుండా రాజకీయ కక్షతో తనను చౌక ధాన్యపు డీలర్ షిప్ నుండి సస్పెండ్ చేశారని వాపోయారు. తాను ఏ రాజకీయ పార్టీకి సంబంధం లేకుండా ప్రభుత్వ నిబంధనల మేరకు రేషన్ కార్డుల లబ్ధిదారులకు నిత్యావసర వస్తువులు సరఫరా చేస్తున్నానని తెలిపారు. గ్రామంలో కూడా తనపై ఎలాంటి ఆరోపణలు లేవని, అంతేకాకుండా రెండు మార్లు విజిలెన్స్ అధికారులు వచ్చి స్టోర్ తనిఖీలు చేశారని , అందులో ఎలాంటి అవినీతి లేదని నిర్ధారించారని చెప్పారు.. అయితే ఇటీవల కొంతమంది తనపై రాజకీయ కక్ష ధోరణి అవలంభిస్తూ లేని పోనీ ఆరోపణలతో మండల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. అందుకు తాను సంజాయిషీ కూడా ఇచ్చానని చెప్పారు. తనపై కక్ష కట్టిన కొందరు అధికారులపై ఒత్తిళ్లు చేసి ఈ నెలలో తన డిపోకు కు బియ్యం బస్తాలు రాకుండా చేశారని, ఆఖరికి డీలర్ షిప్ ను సస్పెండ్ చేసినట్లు రెవెన్యూ అధికారులు పేర్కొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తనను డీలర్ షిప్ నుండి సస్పెండ్ చేయడం ద్వారా జీవనాధారం కష్టంగా మారే అవకాశం ఉందని ఆదినారాయణప్ప ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అంటే తనకు ఎంతో అభిమానమని, సినీ రంగం, రాజకీయ రంగంలో ఆయన చేపట్టే అభివద్ధి కార్యక్రమాలు సమాజానికి ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. గ్రామంలో కొంతమంది తనపై కక్ష కట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. పనిచేయడానికి చేతకాని మరుగుజ్జుపై కనికరం చూపి యధావిధిగా తన డీలర్ షిప్ కొనసాగే విధంగా సహకరించాలని ఎమ్మెల్యే బాలకృష్ణను, సంబంధిత ఉన్నతాధికారులకు ఆదినారాయణప్ప కోరుతున్నాడు.

ప్రయివేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు
మంత్రి సవిత

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

ప్రజాశక్తి-సోమందేపల్లి

రాష్ట్రంలో ప్రయివేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అందిస్తున్నామని మంత్రి సవిత పేర్కొన్నారు. శుక్రవారం మండలకేంద్రం లోని ప్రభుత్వ పాఠశాలలో తల్లిదండ్రులు,ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు,ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సిఎస్ఆర్ ఫండ్స్ కింద రూ. 1.20 కోట్లతో నిర్మించిన ఆడిటోరియంను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో మంత్రి సవిత మాట్లాడుతూ ప్రయివేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన ఉందని అన్నారు. అవార్డులు పొంది,మంచి నైపుణ్యం ఉన్న ఉపాధ్యాయుల చేత పిల్లలకు విద్యా బోధన చేయిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లల చదువుపై దృష్టిసారించాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే గుర్తించి వాటిని పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఆనంద్, టిడిపి మండల కన్వీనర్ నడింపల్లి వెంకటేష్, రాష్ట్ర ఉప్పరసగర కార్పొరేషన్ చైర్మన్ వెంకటరమణ, రాష్ట్ర బోయ వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ డివి ఆంజనేయులు, గోరంట్ల మార్కెట్ యార్డ్ చైర్మన్ శైలజ,మాజీ కన్వీనర్ సిద్ధలింగప్ప, జయరాజ్, వెంకటలక్ష్మి, ఆంజనేయులు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి : విద్యార్థులలో మరింత విజ్ఞానం పెంపొందేలా వినూత్న రీతిలో విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనలను ఏర్పాటు చేసేలా ప్రోత్సహించాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఉపాధ్యాయులకు సూచించారు. మండల కేంద్రంలోని నీలం సంజీవరెడ్డి జిల్లా పరిషత్ ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన తల్లిదండ్రులు – ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా పాఠశాలలో వివిధ అంశాలపై విద్యార్థులు ఏర్పాటు చేసిన విజ్ఞాన శాస్త్ర ఎగ్జిబిషన్ ను కలెక్టర్ పరిశీలించి అభినందించారు. విద్యార్థుల హాజరు, విద్యా ఫలితాలపై క్లాస్ రూములో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. పాఠశాల అభివృద్ధి, మౌలిక వసతులపై తల్లిదండ్రుల సూచనలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మెగా పిటిఎం 3.0. విద్యార్థులు, తల్లిదండ్రులు, గురువుల మధ్య సత్సంబంధాలను మెరుగుపరుస్తుందని, పాఠశాలల అభివృద్ధికి దోహదం చేస్తుందని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 2553 అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 2.65 లక్షల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారన్నారు. వీరందరికీ 12,500 మంది ఉపాధ్యాయులు, 672 మంది నాన్ టీచింగ్ స్టాఫ్ బోధన చేస్తున్నారని చెప్పారు. విద్యార్థులు వారిలో ఉన్న నైపుణ్యాలను ప్రదర్శిస్తూ ఏర్పాటు చేసిన విజ్ఞాన ప్రదర్శనలు, ఆటలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

బాల్యవివాహాలను అరికట్టాలి : శ్రీ సత్య సాయి జిల్లాను బాల్యవివాహాల రహితంగా రూపొందించడంలో తల్లిదండ్రులు ప్రజలు భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా బాల్య వివాహాల నివారణ అవగాహన నిమిత్తం వంద రోజుల కార్యక్రమం నిర్వహణకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం పాఠశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెడల్స్ బహూకరించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి కలెక్టర్ సహా పంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, హెచ్ఎం వివిసి గిరి, ఎస్ఎంసి చైర్మన్ సోము, ఎంఇఒలు నాగరాజు, కుల్లాయప్ప, తహశీల్దార్ సౌజన్య లక్ష్మి, ఎంపీడీవో నరసింహామూర్తి, విద్యార్థులు, తల్లిదండ్రులు, సేవా భావులు, పూర్వపు విద్యార్థులు, పాఠశాల మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : విద్యార్థులు మానసిక ఒత్తిడిని జయించాలని ఎమ్మెల్యే బాలయ్య పిఏ వీరయ్య అన్నారు. శుక్రవారం పట్టణంతో పాటు రూరల్ మండల వ్యాప్తంగా ఉ్న అన్ని పాఠశాల, కళాశాలల్లో మెగా పి టీ ఎం 3.0 నిర్వహించారు. ఇందులో భాగంగా కొట్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అజీజీయా ఉన్నత పాఠశాల, కేజీబివి, బాలికల ఉన్నత పాఠశాలల్లో జరిగిన కార్యక్రమాల్లో ఎంఇఒలు గంగప్ప, ప్రసన్న లక్ష్మిలతో కలిసి బాలయ్య పీఏ వీరయ్య పాల్గొన్నారు. అదే విధంగా మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్ ఎంజిఎం, పద్మశ్రీ కల్లూరు సుబ్బరావు ఓరియంటల్ ఉన్నత పాఠశాలతో పాటు ఇతర పాఠశాలల్లో జరిగిన కార్యక్రమాల్లో చైర్మన్ తో పాటు పట్టణ సిఐ రాజగోపాల్ నాయుడు పాల్గొన్నారు. బాలికల పాఠశాలలో విద్యార్థులతో కలిసి వీరయ్య, ఎంఈఓలతో పాటు ఎంపిడిఓ దామోదరమ్మ మధ్యాహ్నభోజనం చేశారు. ఈ కార్యక్రమాల్లో హెచ్ఎంలు రంగనాయకులు, పెన్నోబలం, శోభారాణి, సామ్రాజ్యం, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మాధవి లత, నాగమణి, ఎంటీఎఫ్ రాష్ట్ర నాయకులు సిద్ధగిరి శ్రీనివాసులు, మాజీ చైర్మెన్ విద్యాసాగర్, టీడీపీ నాయకులు డైమండ్ బాబా, జనసేన నాయకులు నిమ్మకాయల రాము, ఎస్‌డిజిఎస్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో జె యస్ వి యస్, ప్రసాద్, ఎంబీఏ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ నాగేంద్ర కుమార్, సచివాలయ అడ్మిన్ సెక్రెటరీ పి జీవన్ కుమార్. ఎస్సీ హాస్టల్ వార్డెన్ వీరనారాయణ, జూనియర్ కళాశాల ఇంచార్జ్ ఆర్ రాము. ఫిజికల్ డైరెక్టర్ హేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఆయా పాఠశాల, కళాశాలల్లో జరిగిన కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులే తొలి గురువులు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

విద్యార్థుల ఎదుగుదలకు తల్లిదండ్రులే తొలి గురువులని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి తెలిపారు. మండలంలోని బీడుపల్లి ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశానికి ఎమ్మెల్యేతో పాటు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. 'తల్లికి వందనం' ద్వారా 65 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ. 87 వేల కోట్లు జమ చేసిందన్నారు. సెల్ఫోన్ వాడకం వల్ల పిల్లలపై దుష్ప్రభావం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల్లో మానవతా విలువలు పెంపొందించడంలో ఉపాధ్యాయులు తమ వంతు పాత్ర పోషించాలన్నారు. పల్లె మాట్లాడుతూ పిల్లల చదువే తల్లిదండ్రులకు అసలైన ఐశ్వర్యమని, చదువుతోనే ప్రతి ఒక్కరికీ విజ్ఞానమన్నారు. ప్రతిభావంతులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. సమావేశంలో ఎస్ఎంసి చైర్మన్ లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ రాధ, హెచ్ఎం గోపాల్నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమడగూరు : మండలంలోని మోడల్ స్కూల్, కెజిబివి, జడ్పీ హైస్కూల్లో నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశానికి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాగా చదువుకోవాలని, తద్వారా మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రతిభావంతులకు వారు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఒ జిలాన్ బాషా, సంపూర్ణ, హెచ్ఎంలు రమణారెడ్డి, గోపాల్ నాయక్, కెజిబివి ఎస్ఒ వెంకటరమణమ్మ, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

పుట్టపర్తి మండలంలోని విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే ప్రజాదర్బార్

అమడగూరు : ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు బాధ్యతగా పని చేయాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్లో ఎమ్మెల్యే తో పాటు మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యలపై ప్రజలు ఇచ్చిన ప్రతి అర్జీకి నిర్ణీత గడువులోపు పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ఎక్కువగా రెవెన్యూ, ఆస్తి సమస్యలు వస్తున్నాయని రెవెన్యూ అధికారులు న్యాయబద్ధంగా సమస్యలను పరిష్కరించాలన్నారు. అలాగే విద్యుత్, నూతన గృహాలు, పింఛన్లు, తాగునీరు, రోడ్లు, పారిశుధ్యం, ఉపాధి హామీ, వీధిలైట్లు, తదితర సమస్యలపై అర్జీలు అందాయి. వాటి పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం సిఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను వారు లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్లు శ్రీనివాసరెడ్డి, రామనాథరెడ్డి, ఎంపిడిఒలు శ్రీనివాసులు, మునెప్ప, శివప్రసాద్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మార్కెట్ యార్డ్ కమిటీ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-కదిరి టౌన్

కదిరి రూరల్ మండలం కుమ్మరవాండ్లపల్లి మార్కెట్ యార్డ్లో శుక్రవారం నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం వైభవంగా జరిగింది. ముందుగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సమక్షంలో చైర్పర్సన్గా అనసూయమ్మ, వైస్ చైర్మన్గా కొమ్మినేని గంగయ్య నాయుడు, డైరెక్టర్లు ప్రమాణస్వీకారం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. రైతుల సంక్షేమం, మార్కెట్ యార్డ్ అభివృద్ధికి ఎల్లవేళలా బాధ్యతగా పని చేయాలన్నారు. రైతులు పంట ఉత్పత్తులను విక్రయించుకునేందుకు వచ్చినపుడు స్నేహపూర్వకంగా వ్యవహరించాలన్నారు. కష్టపడి పనిచేసే గౌరవం, గుర్తింపు, పదవులు వస్తాయని పార్టీ శ్రేణులకు తెలిపారు. వైసిపి హయాంలో మద్యం విక్రయాల ద్వారా వచ్చిన సొమ్మును బయటి దేశాలకు తరలించారని విమర్శించారు. హంద్రీనీవా కాలువలు పూర్తయినా చెరువులకు నీరివ్వ లేదన్నారు. కూటమి ప్రభుత్వం ప్రతి ఎకరాకు సాగునీరు ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో అహుడా చైర్మన్ వరుణ్, జనసేన సమన్వయకర్త భైరవ ప్రసాద్, నాయకులు సుంకర శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డ్ చైర్మన్కు అభినందనలు

కొత్తచెరువు : కదిరి మార్కెట్ యార్డ్ చైర్పర్సన్గా ప్రమాణ స్వీకారం చేసిన జనసేన పార్టీకి చెందిన అనసూయ చౌదరిని పుట్టపర్తి మార్కెట్ యార్డ్ చైర్పర్సన్ పూల శివప్రసాద్ మర్యాద పూర్వకంగా కలిసి శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమం, మార్కెట్ యార్డుల, రైతుల అభివృద్ధికి చిత్తశుద్ధితో పని చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నల్లమాడ జనసేన అధ్యక్షుడు మహేష్, హనుమంతునాయక్, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డ్ చైర్పర్సన్ అనసూయ చౌదరికి శుభాకాంక్షలు తెలుపుతున్న పూల శివప్రసాద్

పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణానికి నేడు భూమిపూజ

నల్లచెరువు : మండలంలోని పంతులుచెరువు గ్రామ పంచాయతీ కార్యాలయ భవనం నిర్మాణానికి శనివారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ భూమిపూజ చేస్తారన్నారు. కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని టిడిపి మండల కన్వీనర్ రాజశేఖర్బాబు, గుత్తా ప్రసాద్ కోరారు.

ప్రయివేటుకు దీటుగా ప్రభుత్వ విద్య : జెసి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రయివేట్కు దీటుగా సర్కార్ బడుల్లో మెరుగైన విద్యనందిస్తోందని జాయింట్ కలెక్టర్ మౌర్యభరద్వాజ తెలిపారు. ఉపాధ్యాయులు సమన్వయంతో విధులను బాధ్యతగా నిర్వర్తించాలని సూచించారు. పట్టణంలోని కొత్తపేట పురపాలక బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి జెసి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన చదువు ఎంతో అవసరమన్నారు. పిల్లలను మంచి పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. బాల్య వివాహం చేసుకోవద్దు అని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆర్డీవో మహేష్, ఎంఇఒ రాజేశ్వరి దేవి, హెచ్ఎం రాంప్రసాద్, ఎస్ఎంసి చైర్మన్ శ్రీదేవి, వైస్ చైర్మన్ సాహిన, అధికారులు, ఉపాధ్యాయులుపాల్గొన్నారు.

విద్యార్థులు నైతిక విలువలు పెంపొందించుకోవాలి

బుక్కపట్నం: విద్యార్థులు విద్యతో పాటు నైతిక విలువలు పెంపొందించుకోవాలని ఆర్డీవో సువర్ణ సూచించారు. స్థానిక కెజిబివిలో నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పాఠశాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో తహశీల్దార్ నరసింహులు, ఎంఇఒ గోపాల్ నాయక్, ఎస్ఒ సౌజన్య, ఎస్ఎంసి చైర్మన్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ మౌర్యభరద్వాజ

అనారోగ్యంతో అంగన్వాడీ కార్యకర్త మృతి

కదిరి టౌన్ : ఎన్నో ఏళ్లుగా పట్టణంలో అంగన్వాడీ కార్యకర్తగా పని చేస్తున్న సరోజమ్మ శుక్రవారం అనా రోగ్యంతో మృతి చెందారు. విషయం తెలియడంతో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎల్. నరసింహులు అక్కడికి చేరుకుని ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ సరోజమ్మ అంగన్వాడీ కార్యకర్తగా, అంగన్వాడీ యూనియన్ సెక్టార్ నాయకురాలి సేవలందించారన్నారు. ఆమె మృతి యూనియన్కు తీరని లోటు అన్నారు. ఆయనతో పాటు ముస్తాక్, బాబ్జాన్, జగన్, రామ్మోహన్, అంగన్వాడీ యూనియన్ నాయకురాళ్లు సుజాత, ప్రమీల, లక్ష్మిదేవి, ఎలిజిబెత్ రాణి, భారతి, అలివేలమ్మ, చంద్రకళ, రామలక్ష్మి తదితరులు నివాళులర్పించారు.

రహదారి పనుల పరిశీలన

చిలమత్తూరు : మండలంలోని శెట్టిపల్లి పంచాయతీ కమ్మయ్యగారి పల్లిలో జరుగు తున్న రహదారి పనులను శుక్రవారం టిడిపి మండల కోఆర్డినేటర్ రంగారెడ్డి, నాయకులు పరిశీలించారు. పనులను గడువులోపు నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్కు సూచించారు. గ్రామస్తులతో మాట్లాడి వారి అవసరాలు, సమస్యలు తెలుసుకున్నారు. గ్రామంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీ కాలువల నిర్మాణ పనులను త్వరలో చేపడతామని హామీ ఇచ్చారు. వారి వెంట నాయకులు మల్లిరెడ్డి, మల్లికార్జున, ప్రవీణ్, రాజు, లక్ష్మి నారాయణరెడ్డి ఉన్నారు.

ఎపి ఎన్జిఒ ఎన్నికలు ఏకగ్రీవం

పుట్టపర్తి రూరల్ : పట్టణంలోని సాయి ఆరామంలో శుక్రవారం ఎపి ఎన్జిఒ తాలూకా యూనిట్ ఎన్నికలు నిర్వహించారు. నామినేషన్ల ప్రక్రియ అనంతరం ఒక్కో పోస్టుకు ఒక్కో అభ్యర్థి నామినేషన్ దాఖలు చేయగా ఎన్నికలు ఏకగ్రీవం అయ్యా యి. ఎన్నికల అధికారిగా ఈశ్వరయ్య, సహాయ ఎన్నికల అధికారిగా శంకర్, ఎన్నికల పర్యవేక్షణ అధికారిగా శంకరనారాయణ వ్యవహరించారు. నూతన కమిటీకి రాష్ట్ర ఉపాధ్యక్షులు మాధవ, జిల్లా అధ్యక్షులు రామ్మోహన్, అనంతపురం జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్రెడ్డి, కార్యదర్శి చంద్రమోహన్ శుభాకాంక్షలు తెలిపారు.

మాదకద్రవ్య రహిత సమాజం నిర్మిద్దాం

కొత్తచెరువు : మాదకద్రవ్య రహిత సమాజం నిర్మిద్దామని ఈగల్ ఆర్ఎస్ఐ శ్రీహరి పిలుపునిచ్చారు. స్థానిక శ్రీసత్యసాయి జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్లో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు మంచి, చెడు గురించి తెలుసుకొని గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాల బారిన పడకుండా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాల వాడకం వాటి వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఎక్కడైనా మాదకద్రవ్యాల వినియోగం, అమ్మకం, రవాణా, తదితర విషయాలు తెలిస్తే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు తెలియజేయాలన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ధర్మవరం రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజాదర్బార్ లక్ష్యమని నియోజకవర్గ టిడిపి ఇన్ఛార్జి పరిటాల శ్రీరామ్ తెలిపారు. పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురం కూడలిలో ఉన్న పార్టీ కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించగా మహిళలు పెద్దఎత్తున తరలివచ్చి అర్జీలు ఇచ్చారు. అత్యధికంగా ఇళ్ల స్థలాలు, ఇళ్లు, పింఛన్ల కోసం అర్జీలు అందినట్లు శ్రీరామ్ తెలిపారు. అలాగే విద్యుత్ సమస్యలు, టిడ్కో ఇళ్లు, చెత్త తరలింపు, డ్రెయినేజీలు, వీధి కుక్కల బెడదపై కూడా వినతులు ఇచ్చారన్నారు. ఆయా సమస్యలను శ్రీరామ్ సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు సందా రాఘవ, పరిసే సుధాకర్, మహేష్ చౌదరి, మాధవరెడ్డి, బీమినేని ప్రసాద్, నాగూర్ హుసేన్ పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న పరిటాల శ్రీరామ్

హోంగార్డులకు ఆటల పోటీలు

పుట్టపర్తి రూరల్ : డిసెంబర్ 6వ తేదీ హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవం సందర్భం గా శుక్రవారం పట్టణంలోని పోలీసు పరేడ్ మైదానంలో హోంగార్డులకు ఆటల పోటీలు నిర్వహించారు. పురుషుల విభాగంలో 100 మీటర్ల పరుగు, షాట్పుట్, మహిళా విభాగంలో 100 మీటర్ల పరుగు, షాట్ పుట్, లెమన్ అండ్ స్పూన్ ఆటలు నిర్వహించారు. ఆయా పోటీల్లో హోంగార్డులు ప్రతిభను ప్రదర్శించారు. విజేతలకు శనివారం ఎస్పీ చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేస్తారు. కార్యక్రమంలో ఆర్ఐ మహేష్, ఆర్ఎస్ఐ ప్రసాద్, హోగార్డు ఇన్ఛార్జి రామాంజనేయులు, పాల్గొన్నారు.

'స్క్రబ్ టైఫస్'వ్యాధిపై అవగాహన

మడకశిర టౌన్ : మండలంలోని కదిరేపల్లి గ్రామంలో శుక్రవారం వైద్య శాఖ ఆధ్వర్యంలో స్క్రబ్ టైఫస్ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వ్యాధి ప్రబలకుండా ముందుజాగ్రత్త చర్యగా గ్రామంలో నివారణ మందు పిచికారి చేయించారు. డాక్టర్ నరేష్ కుమార్, అసిస్టంట్ మలేరియా అధికారి లక్ష్మీనాయక్ మాట్లడుతూ ఈ వ్యాధి చిగ్గర్ మైట్ అనే క్రిమి కాటు ద్వారా వ్యాపిస్తుందన్నారు. ఈ క్రిమి గడ్డివామి, పొలాలు, పొదలు, పశువుల పాకలు, వ్యవసాయ క్షేత్రాల్లో ఆవాసం ఉంటుందన్నారు. ఆయా ప్రాంతాల్లో పని చేసే వారు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ వ్యాధి ఒకరి నుంచి మరొకరికి వ్యాపించదన్నారు. ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని, చికిత్స ద్వారా నయం అవుతుందని తెలిపారు. వారి వెంట ఎంటమాలజిస్ట్ బాలాజీనాయక్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ షమీఉల్లా, ఆరోగ్య కార్యకర్త రమేష్ కుమార్ ఉన్నారు.

సహకార సంఘం ఎన్నికలు వాయిదా

రొద్దం : మండలంలోని రొద్దం, తురకలాపట్నం, కోగిర, ఎం.కొత్తపల్లి గ్రామాల్లో శుక్రవారం గొర్రెల కాపరుల సహకార సంఘం ఎన్నికలు నిర్వహించారు. అందులో రొద్దం, కోగిర సహకార సంఘాలు ఎన్నికల సజావుగా నిర్వహించారు. మిగిలిన ఎం.కొత్తపల్లి, తురకలాపట్నం గ్రామాల్లో వాయిదా వేసినట్లు పశు వైద్యాధికారులు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలైనా ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కాకపోవడంతో ఎన్నికలు నిలిపివేసినట్లు వారు తెలిపారు.

13,14 తేదీల్లో వాలీబాల్ టోర్నీ

అగళి : అగళి వాలీబాల్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నె 13, 14 తేదీల్లో అగళిలో ఉమ్మడి అనంతపురం జిల్లాస్థాయి మెగా వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విన్నర్స్కు రూ. 33,333, రన్నర్స్కు రూ. 22,222, మూడు, నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లకు రూ. 11,111, రూ. 5,555 అందజేస్తామన్నారు. ఎలాంటి ప్రవేశ రుసుము లేదన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఈ నెల 5వ తేదీ లోపు జట్టు పేరు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు కరియన్న 94403 66050, యశ్వంత్ 8688559036, మంజు 77996 64868లను సంప్రదించాలన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

ధర్మవరం రూరల్ : 4 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు సిఎస్డిటి చెన్నకేశవ నాయుడు తెలిపారు. మండలంలోని గూడ్స్షెడ్ కొట్టాల వద్ద గొట్లూరుకి పోయే దారిలో శుక్రవారం ఓ బొలెరో, ఆటోలో రేషన్ బియ్యం తరలిస్తుండగా విద్యార్థి సంఘాల నాయకులు గుర్తించి వాటిని అడ్డుకుని రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో సిఎస్డిటి అక్కడికి చేరుకుని 4 టన్నుల బియ్యం, ఆ 2 వాహనాలను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

విద్యార్థులకు భోజనం ప్లేట్లు వితరణ

ధర్మవరం రూరల్ : పట్టణంలోని దిగువగేరి మున్సిపల్ మోడల్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం దాత చెన్నమశెట్టి జగదీశ్వర ప్రసాద్ 60 మంది విద్యార్థులకు భోజనం ప్లేట్స్ పంపిణీ చేశారు. దాత ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు బాగుండాలంటే విద్య చాలా అవసరం అన్నారు. విద్య ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో వార్డ్ ఇన్ఛార్జి జూటూరు వెంకటేష్, హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లోని నైపుణ్యాలు వెలికితీయాలి

ప్రజాశక్తి-తనకల్లు

విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికితీయాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని సిజి ప్రాజెక్టు వద్ద ఉన్న గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశానికి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో విద్యారంగంలో అనేక మార్పులు తీసుకొచ్చిన ఘనత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్కు దక్కుతుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలను నిరంతరం సందర్శించి వారి పిల్లల బాగోగులను తెలుసుకుని ఉపాధ్యాయులతో మమేకం కావాలని సూచించారు. పాఠశాలకు సంబంధించి ఏవైనా లోటుపాట్లు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించ డానికి కృషి చేస్తామని తెలిపారు. పిల్లలు ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్, విద్యార్థుల సంప్రదాయ నృత్య ప్రదర్శన అలరించాయి. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎం.ఎస్.పార్థసారథి, ప్రిన్సిపల్ మార్గరెట్ మేరీ, పరిశీలకులు, జిల్లా విద్యాశాఖ అధికారి మాధవరెడ్డి, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

నల్లచెరువు : మండలంలోని ఏపి మోడల్ స్కూల్లో నిర్వహించిన పిటిఎంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఇఒ తిరుపాల్ నాయక్ పాల్గొన్నారు.

తనకల్లులో విద్యార్థులు, తల్లిదండ్రులతో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

కదిరి టౌన్ : పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎం.ఎస్.పార్థసారథి, స్వచ్ఛాంధ్ర మిషన్ కమిషన్ డైరెక్టర్ పర్వీన్బాను, ఆర్డిఓ వివిఎస్.శర్మ, మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్, చైర్పర్సన్ దిల్షాద్ ఉన్నీసా, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షల ఫీజు చెల్లించిన మంత్రి

కొత్తచెరువు : ధర్మవరం నియోజకవర్గం లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 2,087 మంది పదో తరగతి విద్యార్థుల పబ్లిక్ పరీక్షల ఫీజును రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చెల్లించారు. ఒక్కో విద్యార్థి రూ. 125 చొప్పున మొత్తం రూ. 2,60,875లను మంత్రి డిఇఒ జి.కృష్ణప్ప ద్వారా చెల్లించారు.

పాలిటెక్నిక్ అధ్యాపకుడికి డాక్టరేట్

కదిరి టౌన్ : పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో భౌతికశాస్త్ర అధ్యాపకుడిగా పని చేస్తున్న రవి డాక్టరేట్ అందుకున్నారు. అమడుగూరు మండలం గువ్వలవల్లికి చెందిన గులివే రవికి అనంతపురం జెఎన్టియు డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆయన సింథసిస్ అండ్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ టెర్నరీ నానో కాంపోసైట్స్ ఇన్సైడ్స్ ఇన్ టూ స్ట్రక్చరల్ సర్ఫేస్ ఏరియా అండ్ మ్యాగ్నెటిక్ ప్రాపర్టీస్' అంశంపై ప్రొఫెసర్ కె.త్యాగరాజన్ పర్యవేక్షణలో పరిశోధన చేసి పత్రాలు సమర్పించారు. ఆయనకు పాలిటెక్నిక్ కళాశాల సిబ్బంది అభినందనలు తెలిపారు.

7న జూడో ఎంపిక పోటీలు

కొత్తచెరువు : ధర్మవరం మండలంలోని చిగిచెర్ల గ్రామంలో ఉండే జూడో స్టేడియంలో ఈ నెల 7వ తేదీ జిల్లా జూనియర్ క్యాండిడేట్ జూడో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా జూడో అసోసి యేషన్ కార్యదర్శి భాస్కర్నాయుడు, తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే భవిష్యత్తుల ఉన్నత ఉద్యోగాలు పొందవచ్చు అన్నారు.

8న చింతచెట్ల వేలం

రొద్దం : మండలంలోని బూచెర్ల పంచాయతీ రాగిమేకలపల్లి గ్రామంలో పంచాయతీకి చెందిన 15 చింత చెట్లకు ఈ నెల 8వ తేదీ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ కృష్ణమూర్తి తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు ఎలాంటి ప్రభుత్వ బకాయిలు ఉండకూడదని, రూ. 1000 రుసుము చెల్లించి పాల్గొనాలన్నారు.

వికలాంగుల దినోత్సవం

అమరాపురం : వికలాంగులు బలహీనులు కాదని, అత్యంత ప్రతిభావంతులని.. కొంచెం మద్దతిస్తే అద్భుతాలు సృష్టిస్తారని ఎంపిడిఒ రామారావు తెలిపారు. స్థానిక జడ్పీ హైస్కూల్ ఆవరణలో శుక్రవారం అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మాజీ జడ్పిటిసి కె.నరసింహమూర్తి, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు గణేష్, ఆర్డిటి ఎస్టిఎల్ అనసూయ హాజరై మాట్లాడారు. అంధ మహిళల టీ-20 క్రికెట్ ప్రపంచ కప్ జట్టు కెప్టెన్ దీపిక జిల్లావాసి కావడం గర్వకారణమన్నారు.

31 నుంచి సిఐటియు జాతీయ మహాసభలు

ప్రజాశక్తి-కొత్తచెరువు

ఈ నెల 31 నుంచి విశాఖపట్నంలో నిర్వహించే 18వ ఆల్ ఇండియా సిఐటియు మహాసభలను జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కోశాధికారి అంజి ముత్యాలు పిలుపు నిచ్చారు. స్థానిక దర్గా కాంప్లెక్స్ వద్ద శుక్రవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మహాసభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నాలుగు నూతన లేబర్ కోడ్లను అమలు చేయడానికి సిద్ధమవుతుందన్నారు. తద్వారా కార్మికుల హక్కులను నిర్వీర్యం చేస్తుందన్నారు. వాటికి వ్యతిరేకంగా పోరాడాలన్నారు. మహాసభలకు అంగన్వాడీ, మధ్యాహ్నం భోజన ఏజెన్సీ, ఆశా, అంగన్వాడీ, భవన నిర్మాణ, ఆటో యూనియన్ కార్మికులు పెద్దఎత్తున పాల్గొనా లని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు లక్ష్మన్న, కేశవ, నాగభూషణ, నాగేష్, శంకర్రెడ్డి, చిరంజీవి, కృష్ణప్ప, గణేష్, ప్రసాద్, రామచంద్ర పాల్గొన్నారు.

సిఐటియు జాతీయ మహాసభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

సిఐటియు ఆధ్వర్యంలో విరాళాల సేకరణ

పుట్టపర్తి రూరల్ : ఆల్ ఇండియా సిఐటియు 18వ మహాసభలు నిర్వహిస్తున్న తరుణంలో కార్మికులు, సిఐటియు నాయకులు విరాళాలు సేకరించారు. పట్టణంలోని దుకాణాలు, హోటళ్లు, షాపింగ్ మాల్స్, కార్యాలయాలకు వెళ్లి విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు పైపల్లి గంగాధర్, ఆఫీస్ బేరర్స్ సిద్ధు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వెంకటేష్, గణేష్, కొండప్ప, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు బాగా చదవాలి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-గుడిబండ

మీ తలరాత మార్చుకునే శక్తి మీ చేతుల్లోనే ఉందని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి విద్యార్థులకు సూచించారు. నియోజకవర్గ వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఫీజు చెల్లిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎంజెపి పాఠశాల, జడ్పీ హైస్కూల్ విద్యార్థుల ను కలిపి శుక్రవారం మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ నిర్వహిం చారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపా ధ్యాయుల నమ్మకం వమ్ము కాకుండా ప్రతి విద్యార్థి బాగా చదువుకుని వారికి మంచి పేరు తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వక్కలిగ కార్పొ రేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, సింగిల్విండో అధ్య క్షులు మద్దనకుంటప్ప, జిల్లా వీరశైవ లింగాయత్ అధ్యక్షులు దుర్గేష్, టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, కార్యదర్శి శ్రీనాథ్, నాయకులు మంజునాథ్, చంద్రశేఖర్ యాదవ్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి-బత్తలపల్లి

వివిధ కారణాలతో మృతి చెందిన వైసిపి కార్యకర్తల కుటుంబాలను, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని శుక్రవారం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పరామర్శించారు. ఆయన మండలంలోని వెంకటగారిపల్లి, బత్తల పల్లి గ్రామాల్లో పర్యటించారు. వెంకటగారిపల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన బోయపాటి సూర్యనారాయణ ఇంటికి వెళ్లి ఆయన భార్య సువర్ణమ్మ, కుమారుడు, కుమార్తెలను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. అనారోగ్యంతో బాధ పడుతున్న మాజీ స్టోర్ డీలర్ ఆదెప్ప, రోడ్డు ప్రమాదంలో గాయపడిన అతని కుమారుడు వెంకట రమణను పరా మర్శించారు. వైసిపి నేత సాలక్క గారి శ్రీనివాసులు ఇంటికి వెళ్లి పలు అంశాలపై చర్చించారు. బత్తల పల్లిలో ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన అశోక్కుమార్ తల్లితండ్రులను పరామర్శించారు. ఆయన వెంట నాయకులు కమతం ఈశ్వరయ్య, గుర్రం శ్రీనివాసరెడ్డి, కోటి సురేష్ కుమార్, షరాబ్, యోగానం దాచారి, మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, ఎంపిటిసి కోటి నరేష్, తదితరులు ఉన్నారు.



మృతుని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కేతిరెడ్డి

స్టేట్ ఫస్ట్ ర్యాంకర్కు సన్మానం

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

గతేడాది పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉర్దూ మీడియం పాఠశాలలకు గానూ స్థానిక దర్గాపేట ఉర్దూ ఉన్నత పాఠశాల విద్యార్థిని ముస్కాన్ స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించింది. దీంతో శుక్రవారం ఆ పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్లో ఉపాధ్యాయులు విద్యార్థిని ముస్కాన్ను సన్మానించి రూ.3 వేల చెక్కు అందజేశారు. హెచ్ఎం కృష్ణవేణి మాట్లాడుతూ ఈ సంవత్సరం కూడా పదో తరగతి విద్యార్థులు వంద రోజుల ప్రణాళికను ఉపయోగించుకొని బాగా చదివి పాఠశాల, తల్లిదండ్రులకు మంచి గుర్తింపు తీసుకు రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లికార్జున, సుధాకర్, అశ్వర్థనారాయణ, అబ్దుల్ హుస్సేన్, రఫీక్ అహమ్మద్, షాహిద్, అమీనా,నాజియా తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ పట్టణ నూతన కార్యవర్గం ఏర్పాటు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో శుక్రవారం ఎస్ఎఫ్ఐ పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. సీనియర్ నాయకులు ఎస్హెచ్.బాషా మాట్లాడుతూ ప్రస్తుతం విద్యారంగంలో నెలకొన్న సమస్యలపై ఉద్యమాలు మరింత ఉధృతం చేయడానికి విద్యార్థి లోకం సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. పట్టణ అధ్యక్షులుగా అమన్, కార్యదర్శిగా శ్రీనాథ్, ఉపాధ్యక్షులుగా బాలాజీ, అఖిల్, ప్రణీత్, యూనస్, ఇమాన్యుయల్ తదితరులను ఎన్నుకున్నారు. త్వరలో జరిగే ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

రోడ్డుపైకి నీరు వదిలిన వారికి నోటీసులు

రొద్దం : ఇళ్లలోని వృథా నీటిని రోడ్డుపైకి వదిలే గృహాల వారికి ఎంపిడిఒ కృష్ణమూర్తి నోటీసులు జారీ చేశారు. కలిపి పంచాయతీ శేషాపురం గ్రామంలో రోడ్డుపైకి మురుగునీరు వదులుతున్న గృహాల వారికి ఇప్పటికే అధికారులు పలమార్లు హెచ్చరికలు జారీ చేశారు. అయినా వారిలో మార్పు రాకపోవడంతో శుక్రవారం సచివాలయ సిబ్బంది ఆ గ్రామంలో కలియ తిరిగి రోడ్డుపై మురుగునీరు వదులుతున్న 9 గృహాల వారికి నోటీసులు అందజేశారు.

ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-గోరంట్ల

పట్టణంలో ప్లాస్టిక్ కవర్లు విక్రయించరాదని పంచాయతీ కార్యదర్శి సంజయ్, సిబ్బంది శుక్రవారం బేకరీ, దుకాణదారులకు తెలిపారు. వారు శుక్రవారం పంచాయతీ పరిధిలోని గుమ్మయ్య గారిపల్లిలో పర్యటించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణం కాలుషితం అవుతుందని వివరించారు. దుకాణాల వద్దకు వెళ్లి ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే చర్యలు తప్పవని తెలిపారు. ప్లాస్టిక్ కవర్లు విక్రయించే దుకాణదారులకు జరిమానా విధించారు.

దుకాణదారులతో మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి సంజయ్

నేరాలు ఘోరాలు

హత్య కేసు నిందితుల అరెస్టు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

గుర్తుతెలియని వ్యక్తి హత్యకేసును ఛేదించి నలుగురు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి 4 సెల్ఫోన్లు, 1 ఆటో ట్రక్ , 1 స్కూటీ, 1 రగ్గు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ సతీష్కుమార్ తెలిపారు. పట్టణంలోని ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ఎస్పీ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గత ఆగస్టు 8వ తేదీ బుక్కపట్నం మండలంలోని మారాల రిజర్వాయర్లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం గుర్తుపట్టలేని స్థితిలో లభించడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. పుట్టపర్తి రూరల్ సిఐ సురేష్, బుక్కపట్నం ఎస్ఐ కృష్ణమూర్తి, వారి సిబ్బంది విచారణలో భాగంగా గాలించి శుక్రవారం నల్లమాడ మండలం రెడ్డిపల్లి గ్రామ శివారులో గ్రీన్ ఫీల్డ్ హైవే వద్ద నల్లమాడ మండలం రెడ్డిపల్లి బిసి కాలనీకి చెందిన రామనోల్లా గంగాభవానీ, వంకరకుంట గ్రామానికి చెందిన వడ్డే గంగాధర్, విష్ణు, సుదర్శన్లను అరెస్టు చేశారు. గంగాభవానీకి వడ్డే గంగాధర్తో వివాహేతర సంబంధం ఉంది. ఈ విషయం తెలిసి రామప్ప భార్యను హెచ్చరించాడు. దీంతో గంగాభవానీ గంగాధర్తో కలిసి భర్తను హత్య చేసేందుకు పథకం వేశారు. ఈ క్రమంలో గంగాధర్, విష్ణు, సుదర్శన్ పథకం ప్రకారం ఇంట్లో నిద్రిస్తున్న రామప్పను హత్య చేసి మృతదేహాన్ని ఆటో ట్రక్లో తీసుకెళ్లి మారాల డ్యామ్లో వేసినట్లు ఎస్పీ వెల్లడించారు. హత్య కేసును ఛేదించిన సిఐ సురేష్, ఎస్ఐ కృష్ణమూర్తి, వారి సిబ్బందిని ఎస్పీ అభినందించినారు. ఎస్పీతో పాటు పుట్టపర్తి డీఎస్పీ విజయ్కుమార్, సిఐ సురేష్, ఎస్ఐ కృష్ణమూర్తి ఉన్నారు.

8 మంది పేకాటజూదరులు..

బత్తలపల్లి : పేకాట స్థావరంపై దాడులు చేసి జూదరులను అరెస్టు చేసి వారి నుంచి నగదు స్వాధీనం చేసుకున్నట్లు శుక్రవారం పోలీసులు తెలిపారు. వివరాలు.. అందిన సమాచారం ఎస్ఐ సోమశేఖర్ సిబ్బందితో కలిసి గురువారం అర్ధరాత్రి మండలంలోని డి.చెర్లోపల్లి గ్రామ శివారులోని ఓ చీనీతోటలో పేకాట స్థావరంపై దాడులు చేశారు. 8 మంది జూదరులను అరెస్టు చేసి వారి నుంచి రూ. 41,350 నగదు, 3 బైక్లు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశారు. దాడుల్లో ట్రైనీ ఎస్ఐ నాగప్రసన్న, కానిస్టేబుల్ సుదర్శన్నాయుడు, రామాంజనేయులు, జనార్ధన్, ఆంజనేయులు, అనిల్కుమార్ పాల్గొన్నారు.

పాడిఆవుల చోరీకి విఫలయత్నం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మండలంలోని కంబాలపర్తి గ్రీన్ ఫీల్డ్ హైవే సమీపంలో కంబాలపర్తి గ్రామానికి చెందిన పాడి రైతు నాగేంద్ర డైరీ ఫామ్ నిర్వహిస్తున్నాడు. అయితే గురువారం అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు పాడి ఆవులను దొంగలించడానికి వచ్చారు. గమనించిన రైతు కుటుంబ సభ్యులు అప్రమత్తమై వారి ప్రయత్నాలను అడ్డుకున్నారు. దీంతో వారు పరారయ్యారు. అయితే రైతు దొంగలకు చెందిన ఓ బైక్ను స్వాధీనం చేసుకొని నల్లమాడ పోలీసులకు అప్పగించారు. ఈ మధ్యకాలంలో నల్లమాడ మండలం చౌటుకుంటపల్లి, ఎద్దులవాళ్ళపల్లిలో పొట్టేళ్లు, బొంతలపల్లి రోడ్డు సర్కిల్లో కోళు చోరీకి గురయ్యాయని, ఇకనైనా పోలీసులు స్పందిచంఇ దొంగల ఆగడాలను అరికట్టాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.